క్లుప్తంగా

అజిత్‌సింగ్‌నగర్‌లో అన్నదానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): కళ్ళే లలిత ఆశయ సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని కళ్ళే లలిత ట్రస్ట్ అధ్యక్షులు కళ్ళే నాగేశ్వరరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లో శనివారం కళ్ళేలలిత ట్రస్ట్ ఆధ్వర్యాన అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కుటుంబ సభ్యులతో కలిసి పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ట్రస్ట్ డైరెక్టర్‌లు సీతా మహాలక్ష్మి, జయదుర్గ, మేఘవాణి, ముప్పూరి హరీష్, ఎం.ఋశ్విన్, జి. ధ్రువన్ పాల్గొని లలిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వీఎంసీ పాఠశాలకు నేమ్ బోర్డు ఏర్పాటు



మధురానగర్(విజయవాడసెంట్రల్): తూనుగుంట్ల రమాదేవి నగర పాలక సంస్థ పాఠశాల భవనంకు ఇటీవల మరమ్మతులు నిర్వహించారు. నేమ్ బోర్డు లేక స్కూల్ బోసిగా ఉండడంతో పూర్వ విద్యార్థి కెంబూరి బ్రదర్స్ కృష్ణ సూరిబాబు సొంత ఖర్చులతో శాశ్వత నేమ్ బోర్డు ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో భవాని కిరణ్, రవి, దావీదు పాల్గొన్నారు.

నేడు కూడా పన్నులు చెల్లించవచ్చు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థకు ముందస్తు పన్నులను ఆదివారం కూడా చెల్లించడానికి వీఎంసీ ఏర్పాట్లు చేసిందని వీఎంసీ డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం సెలవు దినమైనా పన్ను చెల్లింపులకు నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో 13 క్యాష్ కౌంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఇంటి పన్ను , ఖాళీ స్థలాల పన్ను బకాయిలు ఏక మొత్తంలో చెల్లిస్తే వడ్డీపై 50శాతం రాయితీని పొందవచ్చని, 2025 -26 సంవత్సరానికి ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను ఏక మొత్తంలో చెల్లిస్తే 5 శాతం రాయితీని పొందవచ్చని తెలిపారు. నగరవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని కళావేదికపై శనివారం నగరానికి చెందిన శ్రీదుర్గా భవానీ నృత్య కళానిలయానికి చెందిన పలువురు కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై పావని ప్రియాంక పర్యవేక్షణలో 22 మంది కళాకారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. కళాకారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

సొరంగ మార్గంలో బైక్ దగ్ధం



భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సొరంగ మార్గంగుండా వెళుతున్న వ్యక్తి ద్విచక్ర వాహనం తగులబడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం దారపు రాంబాబు అనే వ్యక్తి చిట్టినగర్ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించుకుని సొరంగంలో నుంచి విద్యాధరపురం వైపు వస్తున్నాడు. పక్క నుంచి వస్తున్న వాహనదారుడు మీ బైక్ తగులపడుతుందని చెప్పగానే బైక్ నడుపుతున్న వ్యక్తి దానిని వదిలేసి పక్కకు జంప్ అయ్యాడు. దాంతో స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోవడంతొ వాహనం పూర్తిగా దగ్ధం అయ్యింది. కాగా వాహనదారుడికి త్రుటిలో ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

పెనమలూరు: వివాహిత అదృశ్యమైన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. పమిడిమొక్కల మండలం గడ్డిపాడుకు చెందిన పైడిముక్కుల నాగరాజు, మేఘన భార్యభర్తలు. నాగరాజు తాడిగడపలో ఓ ప్రైవేటు కంపెనీలో స్టోర్ మేనేజర్‌గా పని చేస్తుండగా, భార్య మేఘన విజయవాడలో షాపులో పని చేస్తుంది. కాగా నాగరాజు తన వద్ద పని చేస్తున్న మహిళతో చనువుగా ఉంటున్నాడని భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 11వ తేదీన మేఘన ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం భర్త నాగరాజు, బంధువులు వెతికినా జాడ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మండుటెండ.. ఉక్కపోత..

- నిర్మానుష్యంగా మారిన రోడ్లు
- తాగునీరు లేక అల్లాడిన మూగజీవాలు
- గరిష్టంగా 41 డిగ్రీల ఉష్ణోగ్రత



నిర్మానుష్యంగా మారిన రైల్వే స్టేషన్ రోడ్డు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వేసవి తీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. శనివారం భానుడు భగ భగ మండాడు. నగరం నిప్పుల కొలిమిలా మారింది. మధ్యాహ్నానికి రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. 12 గంటలకే జనాలు ఇంటి బాట పట్టారు. వ్యాపార సముదాయాలు, దుకాణాలు మూసివేశారు. ఉదయం 8 గంటలకే ఎండ తీవ్రత 33 డిగ్రీలకు చేరింది. ఎండ వేడికి తోడు వడగాల్పులు, ఉక్కపోతతో అల్లాడిపోయారు. పశువులు నీరు లేక అల్లాడిపోయాయి. ఆటో రిక్షావాలాలు ఎక్కడ చెట్లు కనబడితే అక్కడ ఆటోలు నిలిపివేసి తలదాచుకున్నారు. ఈ నెల 4, 5, 6 తేదీల్లో నగరంలో వర్షం కురవడంతో ఉక్కపోత పెరిగిపోయింది. యాచకులు, అనాథలు రోడ్లపై కనిపించని పరిస్థితి. ఈ వేసవిలో నగరంలో ఆశించిన స్థాయిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో అనాథలు, నగరానికి వచ్చే వారు ఇబ్బందులు పడ్డారు.

నిర్మానుష్యంగా రహదారులు.....

నగరంలోని గాంధీనగర్, సత్యనారాయణపురం, గవర్నర్‌పేట బీసెంట్ రోడ్డు ప్రాంతాలు మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్మానుష్యంగా మారిపోయాయి. రోడ్లపై జనసంచారం కనిపించలేదు. రోడ్లకు ఇరువైపులా చిరువ్యాపారాలు చేసే వారు సైతం ఎండ తీవ్రత తట్టుకోలేక... సమీపంలోని టీ స్టాల్స్, దుకాణాల ముందు వెళ్లి తలదాచుకున్నారు. శనివారం ఉష్ణోగ్రత ఒక్కసారిగా పెరిగింది. గరిష్టంగా 41 డిగ్రీలకు చేరింది. బందరు రోడ్డు, ఏలూరు రోడ్డులలో ఎక్కడా చెట్లు లేకపోవడంతో పాదచారులు, వాహనదారులకు పట్టపగలే చుక్కలు కనిపించాయి. వేడి తీవ్రతకు ఇళ్లకే పరిమితమయ్యారు. లెనిన్ సెంటర్ మధ్యాహ్న సమయంలో పూర్తిగా ఖాళీగా కనిపించింది. కొందరు లెనిన్ సెంటర్ పార్క్‌లో సేదతీరారు. మరో వారం రోజులపాటు ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. శనివారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పనిచేసినప్పటికీ పూర్తిగా ఖాళీగా ఉంది. మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో సిబ్బంది తప్ప పబ్లిక్ కనిపించలేదు. ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారింది.

కార్మిక శాఖ చలివేంద్రాలు ఎక్కడ?

ప్రతి ఏటా వేసవిలో కార్మిక శాఖ ప్రత్యేకంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసేది. కార్మికులు, ఆటో, రిక్షావాలాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసేవారు. కార్మిక శాఖ నిర్వహించి కార్మికులకు వేసవి ఇబ్బందులు లేకుండా చూసేది కానీ ఈ ఏడాది ఎక్కడా చలివేంద్రాలు పెట్టిన దాఖలాలు లేవు. నగరంలోని బీసెంట్ రోడ్డు, అరండల్‌పేట, ఆర్టీసీ బస్టాండ్, ఆటో రిక్షా స్టాండ్‌లు వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కార్మికులు కోరుతున్నారు.

అల్లాడిపోయిన గోవులు...

సత్యనారాయణపురం, గవర్నర్‌పేట, గాంధీనగర్, బావాజీపేట ప్రాంతాలలో రోడ్లపై నిత్యం గోవులు సంచరించేవి. ఎక్కడ చూసిన పదుల సంఖ్యలో గుంపుగా తిరిగేవి. వ్యాపారులు పెట్టే దాణా తింటూ రోడ్లపై సంచారం చేసేవి. ఎండ తీవ్రత, తాగేందుకు నీరులేక అల్లాడిపోయాయి. చెట్ల నీడకు చేరి సేదతీరాయి. గతంలో కొంత మంది దుకాణదారులు తమ షాపుల ముందు గోవుల కోసం తొట్టెలు ఏర్పాటు చేసి నీళ్లు అందించేవారు. ఇవి కాక జంతు ప్రేమికులు ప్రతి వీధి చివర నీటి తొట్టెలు ఏర్పాటు చేసి నీరు నింపే వారు. ప్రస్తుతం అవి మచ్చుకు కూడా కనిపించడం లేదు. దీంతో రోడ్లపై ఎండలో మూగజీవాలు రొప్పుతూ అల్లాడిపోయాయి.



ఎండ తీవ్రతకు దీనంగా ఉన్న గోవులు

ప్రభుత్వ జూనియర్ కాలేజిలో 68శాతం ఉత్తీర్ణత



జి.రాజ్యలక్ష్మి (984)



షేక్ రేష్మా(973)

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో 68 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియెట్‌కు సంబంధించి కాలేజీలో 143 మంది పరీక్షలు రాయగా వారిలో 97 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరం విద్యార్థిని జి. రాజ్యలక్ష్మి ఎంపీసీ గ్రూప్‌లో 984 అత్యధిక మార్కులు సాధించింది. బైపీసీ గ్రూప్‌లో షేక్ రేష్మా 973 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్ పరీక్షల్లో 250 మంది పరీక్షలు రాయగా వారిలో 130 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ సిఎస్ఎస్ఎస్ఎన్ రెడ్డి తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన జి.రాజ్యలక్ష్మి అతి పేద కుటుంబం నుంచి వచ్చి కష్టపడి చదివి పేరు సంపాదించింది. సెకెండ్ టాపర్ షేక్ రేష్మా తల్లిదండ్రులు షాపులో పనిచేస్తుంటారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు



అఫీపా తబస్సుమ్ తదితరులను అభినందిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏలూరు రోడ్డు చుట్టుగుంట శ్రీ చైతన్య కళాశాల బైపీపీ విద్యార్థిని షేక్ అఫీపా తబస్సుమ్ ఇంటర్ ఫలితాల్లో 992 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే సత్యనారాయణపురం క్యాంపస్‌కు చెందిన విద్యార్థిని సీహెచ్ వైష్ణవి 987 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా కళాశాల డీన్ గుంటూరు హరిబాబు, ప్రిన్సిపాల్ నిజాంపట్నం గోకర్ణేశ్వరరావు విద్యార్థులను అభినందించి నగదు పురస్కారం అందజేశారు. ఎంపీసీ విభాగంలో స్నేహలతరెడ్డి 984, వంశీ కృష్ణ 983 జూనియర్ ఇంటర్‌లో ఎ. సంధ్య 464, కె.ప్రణీతశ్రీ 464, ఎండీ ఖలీఖ్ అహ్మద్ 463 మార్కులు సాధించారని తెలిపారు. ఏజీఎం కె.రంగరావు, షేక్ నాగూర్ మీరావాలి, పి.గణేష్ వైస్ ప్రిన్సిపల్ నీలిమ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్‌లో సత్తాచాటిన విద్యార్థులు

మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కలాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో సత్తాచాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం 61 శాతం, ప్రథమ సంవత్సరంలో 45 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఒకేషనల్ విభాగంలో 92 శాతం ఉత్తీర్ణత సాదించారు. ఎంపీసీ విభాగంలో ఎస్ శృతి 946, బైపీసీ విభాగంలో 944, సీఈసీ విభాగంలో రజని గాయిత్రి 900, హెచ్ఈసీ విభాగంలో జి. ప్రిస్కిల్లా 896 మార్కులు సాధించారు. అలాగే ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థి పి.సాయి కిషోర్, 404, బైపీసీ విద్యార్థి ఎస్‌కే సనా 384, పీఈసీ విభాగంలో కీర్తన 433 ఒకేషనల్ విభాగంలో డి. నాగలక్ష్మి 951 మార్కులు సాధించారు. కార్పొరేట్ విద్యార్థులకు ధీటుగా ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఆర్యాపతి, సిబ్బంది అభినందించారు.

ఎన్ఆర్ఐ విద్యార్థుల విజయభేరి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటర్ ఫలితాల్లో విజయవాడ ఎన్ఆర్ఐ కళాశాల విద్యార్థులు అన్ని విభాగాల్లో అత్యుత్తమ మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో కళాశాల విద్యార్థిని స్వాతి ఐశ్వర్యలక్ష్మీ 990 మార్కులు సాధించింది. బైపీసీలో డి.శశిరేఖ 985 మార్కులు సాధించింది. 16 మంది విద్యార్థులు 980 ఆపై మార్కులు సాధించారు. జూనియర్ ఎంపీసీలో 470 మార్కులకు 466 మార్కులు, బైపీసీలో 440 మార్కులకు 436 మార్కులు సాధించారు. తమ కళాశాలలో నగరంలోని వివిధ బ్రాంచ్‌లలో చదివే విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని కళాశాల సీఈఓ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో శారద విద్యార్థుల ప్రతిభ



కె.యక్షిత, 989 మార్కులు



జి.రసజ్ఞ, 989 (సీనియర్ ఇంటర్ బైపీసీ)

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇంటర్మీడియెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపి అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులు అయ్యారని శారద విద్యాసంస్థల చైర్మన్ వై.రమేష్ బాబు చెప్పారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్ సమీపంలో ఉన్న కళాశాల ఆవరణలో ఇంటర్ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులను శనివారం అభినందించారు. రమేష్ బాబు మాట్లాడుతూ జూనియర్ ఎంపీసీలో 470 మార్కులకు ఐ.ప్రజ్ఞ 466 మార్కులు, వి.శృతి-465, పీవీఎస్ఎస్.వర్షిణీ-465, ఎం.దేవహర్షిణి-465, జూనియర్ బైపీసీలో 440 మార్కులకు గాను ఐ.నమ్రత-463, ఎం.కృష్ణప్రశాంత్-434 మార్కులు సాధించారని వివరించారు. సీనియర్ ఇంటర్‌లో వెయ్యి మార్కులకు కె.యక్షిత, జి.రసజ్ఞ.-989 మార్కులు, వి.స్వీకృతాంజలి, బి.శ్రావణి-987, ఇ.యశస్విని-984 మార్కులు పొందారని చెప్పారు. విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి, కళాశాల సలహాదారుడు ఈఎస్ ఆర్‌కే ప్రసాద్, జనరల్ మేనేజర్ జీవీ రావు, అధ్యాపకులు అభినందించారు.

విద్యామందిర్ సేవలు అభినందనీయం



చిన్నారికి బహుమతి అందిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యాబోధన చేస్తున్న శ్రీ భారతీయ విద్యామందిర్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. శ్రీనగర్ కాలనీ శ్రీ భారతీయ విద్యామందిర్‌లో శనివారం దేశీయ సంప్రదాయ పద్ధతిలో వినూత్నంగా స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వివేకానందుని వస్త్ర వేషధారణలతో ఆయన గుర్తుకు తెచ్చేరీతిలో స్నాతకోత్సవం నిర్వహించటం ప్రశంసనీయం అని కొనియాడారు. మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. కరెస్పాండెంట్ దుర్గాప్రసాద్, పెనుమత్స అప్పలరాజు, చల్లా లక్ష్మీనారాయణ, భాస్కరరాజు, రాఘవరాజు, జేవీ షణత్ కృష్ణ మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. స్నాతకోత్సవ వేడుకలను పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న పర్యవేక్షించారు.

వైభవంగా సుదర్శన యాగం



విజయవాడ కల్చరల్: కంచి కామకోటి పీఠ శ్రీ వెంకటేశ్వర శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో శనివారం జగద్గురువులు విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఆదేశంతో వైభంగా రుత్వికులు సుదర్శన యాగం నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణం, ద్వాదశ ప్రదక్షిణ, సాయంత్రం ధ్వజావరోహణ, పవళింపు సేవ, మహా మంగళహారతి కనులపండువగా నిర్వహించారు. దేవాలయ కార్యక్రమ పర్యవేక్షకులు డాక్టర్ సి.రామ్మోనరావు మాట్లాడుతూ స్వామి వారి ఆదేశంతో దేవాలయంలో అనేక ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తునట్లు తెలిపారు. మేనేజర్ శర్మ పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా కూచిపూడి నృత్యాలు



విజయవాడ కల్చరల్: శ్రీ సీతారామా కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో గిరివీధిలో శనివారం కళాకారులు, చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు మనోహరంగా సాగాయి. నాట్యాచారిణి కృష్ణ గౌతమి పర్యవేక్షణలో చిన్నారులు నృత్యాలు ప్రదర్శించారు. యశ్రాని, శ్రీవాణి, వైష్ణవి, నవ్య, హిమజ, శరణ్య, కృష్ణ కీర్తన, నేహశ్రీ నృత్యాలను అభినయించారు. చిన్నారులకు నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

మాకినేనికి నివాళి

కృష్ణలంక(విజయవాడతూర్పు): దేశ స్వాతంత్ర్యానికి మాకినేని బసవపున్నయ్య పోరాడారని ఎం.బి.విజ్ఞాన కేంద్రం ట్రస్టు చైర్మన్ పి.మధు కొనియాడారు. శనివారం గవర్నరుపేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో మాకినేని బసవ పున్నయ్య వర్ధంతి జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ప్రజా సేవకు ఈ విజ్ఞాన కేంద్రం ప్రజలకు అంకితమైందన్నారు. ట్రస్టు కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు, జయరాం, హరికిశోర్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

పాయకాపురం(విజయవాడరూరల్): నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 64వ డివిజన్లో విజయవాడ నగర పాలక సంస్థ నిధులు రూ.19.43 లక్షలతో నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్‌నగర్ నుంచి కండ్రిక వరకు రూ.9 కోట్లతో పనులు చేపట్టామని తెలిపారు. కండ్రిక సెంటర్ నుంచి మెయిన్ రోడ్డు వరకు మరో నాలుగు కోట్ల రూపాయల నిధులను కేటాయించి ప్రధాన డ్రైనేజీ నిర్మించేందుకు అంచనాలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 21 డివిజన్లలో సమస్యలపై తనకు అవగాహన ఉందని వాటిని పరిష్కరించే దిశగా పనులు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పలగాని శివ, పలగాని భాగ్యలక్ష్మి, కాకొల్లు రవికుమార్, కంకణాల బాబు, కోరాడ రమణ, షస్తక్ బాబు, ఎం.అంజిబాబు, సత్యనారాయణ, చలపతి రావు, బాబురావు డీఈ లక్ష్మి సింధూర, ఏఈ మాధవ్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు పోలీసులు స్పందించారు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బేగ్ తదితరులు



మధురానగర్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎట్టకేలకు పోలీసులు స్పందించారు. మధురానగర్ రైల్వేస్టేషన్‌లో శనివారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మధురానగర్ రైల్వేస్టేషన్ ఆకతాయిలకు అడ్డాగా మారింది. దీంతో ప్రయాణికులు, స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ సాక్షిలో శనివారం ఆకతాయిలకు అడ్డాగా మధురానగర్ రైల్వేస్టేషన్ శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బేగ్, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ జేవీ రమణలతో కలిసి మధురానగర్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. ఆకతాయిలు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆకతాయిలు ఎటువైపు నుంచి వస్తున్నారు....ఎలా వెళుతున్నారు తదితర విషయాలను చర్చించారు. ఇక నుంచి రెగ్యులర్‌గా ఇక్కడ తమ పోలీసులు సమన్వయంతో గస్తీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆకతాయిలపై ఉక్కుపాదం

ఆకతాయిలపై ఉక్కుపాదం మోపుతామని ప్రజలకు మరింత మెరుగైన భద్రత కల్పించనున్నట్లు ఏసీపీ దామోదర్ అన్నారు. స్థానిక మధురానగర్ రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాలను శనివారం సాయంత్రం గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్, సీసీఎస్ సిబ్బంది, మూడు పోలీస్‌స్టేషన్‌ల సిబ్బందితో కలిసి పరిశీలించారు. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో డ్రోన్‌లను ఎగురవేసి ఆకతాయిల గురించి ఆరాతీశారు. చుట్టుపక్కల ప్రాంతవాసులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆకతాయిలు, మందుబాబుల బెడద ఉందని చెప్పారు. విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఒక వ్యక్తి వద్ద గంజాయి ఉండటంతో అతనిని అదుపులోకి తీసుకుని గుణదల పోలీసులకు అప్పగించారు. ఇక నుంచి డ్రోన్‌ల ద్వారా నిరంతర నిఘా కొనసాగించనున్నట్లు ఏసీపీ తెలిపారు.

భారతీయ సంస్కృతి ప్రపంచానికి దిక్సూచి

పెనమలూరు: భారతీయ సంస్కృతి ప్రపంచానికి దిక్సూచి అని తిరుపతి మోహన్‌బాబు యూనివర్సిటీ అసోసేట్ ప్రొఫెసర్, డీన్ డాక్టర్ శాకమూరి రవిచంద్రబాబు అన్నారు. కానూరు సిద్ధార్థ అకాడమీ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్‌లో ఇంగ్లీష్ విభాగం, లిటరరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎథిక్స్ ఫ్రమ్ ఎపిక్స్, ఇతిహాసంలోని మానవీయ విలువలు అనే అంశంపై శనివారం జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. మహాభారతం, రామాయణంలో నీతిపాఠాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ధర్మం, కర్తవ్యం, నైతికత, కరుణ వంటి అంశాలను ఇతిహాస ఘట్టాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా రవిచంద్రబాబును నిర్వాహకులు సత్కరించారు.

ప్రారంభమైన శ్రీరంగమ్మ అమ్మవారి మహోత్సవాలు



గన్నవరం: మండలంలోని తేలప్రోలులో కొలువైన శ్రీరంగమ్మ పేరంటాలు అమ్మవారి మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. గత కొన్ని రోజులుగా తేలప్రోలు, సీతారామపురంలో జరుగుతున్న గ్రామోత్సవాన్ని పూర్తిచేసుకుని తెల్లవారుజామున అమ్మవారు ఆలయ ప్రవేశం చేశారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం అమ్మవారికి ఊయల సేవ నిర్వహించారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీకి చెందిన జక్కా చంద్రశేఖర్, ఉదయ్, రమేష్ సోదరులు తెలిపారు. అమ్మవారి దర్శనం నిమిత్తం రాష్ట్రం నలుమూలాల నుంచి భక్తులు తరలివస్తారని చెప్పారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసినట్లుగా తెలిపారు.

లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

ఏఐఎల్ఆర్ఎస్ఏ డిమాండ్



లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలపై మాట్లాడుతున్న రామకృష్ణ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):భారతీయ రైల్వే ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎల్ఆర్ఎస్ఏ (ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్) విజయవాడ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆరవ నెంబర్ ప్లాట్‌ఫాంలోని క్రూ బుకింగ్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐఎల్ఆర్ఎస్ఏ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ మాట్లాడుతూ రైల్వేలోని లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలపై రైల్వేశాఖ మంత్రి మల్టీ డిసిప్లినరీ కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ రన్నింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తుందని ప్రకటించినట్లు తెలిపారు. కానీ నేటికీ లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా రైల్వేబోర్డు, రైల్వేశాఖ తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా డ్యూటీ అవర్స్‌ను గూడ్స్‌లలో 8 గంటలు, కోచింగ్‌లో 6 గంటలకు పరిమితం చేయాలని కోరారు. రాత్రి డ్యూటీలను రెండు రాత్రులకు పరిమితం చేయాలని, పీఆర్‌ను 30 గంటల నుంచి 40 గంటలకు పెంచాలని, 130 కిలోమీటర్ల వేగంతో నడిచే రైళ్లలో ట్రిప్ అలవెన్స్, కో-పైలట్‌లను నియమించాలని, మెమో, డెమో రైళ్లలో ఏఎల్‌పీలను నియమించాలని తెలిపారు. ఎఫ్ఎస్‌డి భారం నుంచి ఏఎల్‌పీకి విముక్తి కల్పించాలని, 30 గంటలలో హెడ్ క్వార్టర్స్‌కు పంపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎల్ఆర్ఎస్ఏ డివిజనల్ అధ్యక్షుడు వెంకటేషన్, కార్యదర్శి ఆర్.వి. రాము, నాయకులు కె.రాజేష్, ఎ.శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కమర్షియల్ క్లాప్!



కళావేదిక ఎదుట సినిమా సందడి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కొత్త సినిమాను ప్రారంభించడం విమర్శలకు దారి తీసింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కమర్షియల్ చిత్రానికి క్లాప్ కొట్టడంతో భక్తులు విస్తుపోయారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదిక ఇందుకు వేదికై ంది. ఆధ్యాత్మిక కేంద్రాలైన ఆలయ ప్రాంగణాల్లో సినిమా, రాజకీయ విషయాలను చర్చించడం, మాట్లాడటం, వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం నిషేధం. కళావేదిక ఎదుట కొత్త సినిమాను ప్రారంభించుకునేందుకు అనుమతించడం ఎంతవరకు సబబని భక్తులు ప్రశ్నిస్తున్నారు. సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమానికి సదరు నిర్వాహకులు నేరుగా దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ నుంచి అనుమతి తీసుకోవడం కొసమెరుపు. మరో వైపు సదరు సినిమా ప్రారంభోత్సవానికి అవసరమైన సామగ్రిని మొత్తం లిఫ్టుల ద్వారానే కొండపైకి తరలించారు.భక్తుల రద్దీ అధికంగా ఉన్న తరుణంలో లిఫ్టులోకి భక్తులను అనుమతించకుండా సామగ్రిని కిందకు తరలించారు. భక్తుల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి.